# సత్య తెలంగాణ

ప్రజా గొంతుక-తెలుగు దినపత్రిక








ప్రచురణ : హైదరాబాద్ | సంపుటి : 2 | సంచిక : 68 | ఎడిటర్ : గుజ్జ సత్యం | శనివారం, మే,30, 2026 | పేజీలు : 4 | వెల : రూ. 5 /-


ఉద్యోగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న

## రేవంత్ ప్రభుత్వం..

- ఉద్యోగుల బకాయిలను 100 రోజుల్లో విడుదల చేస్తామని హామీ
- ఈ క్రమంలో తొలి విడతగా రూ.2 వేల కోట్ల బకాయిల విడుదల
- ఉద్యోగ సంఘాలు, రిటైర్డ్ ఉద్యోగులు హర్షం..



**హైదరాబాద్,మే,29,(సత్య తెలంగాణ):** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు కాంగ్రెస్ సర్కారు శుభవార్త చెప్పింది. పెండింగ్ బకాయిల తొలి విడత మొత్తాన్ని విడుదల చేశారు. ఉద్యోగుల సుదీర్ఘకాల బకాయిలను కేవలం 100 రోజుల్లో రూ.6,000 కోట్లు విడుదల చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపము ఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క ఉద్యోగ జేఏసీ నాయకులకు స్పష్టమైన హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ హామీని నెరవేర్చే దిశగా, రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఈరోజు తొలి విడతగా రూ.2,000 కోట్ల నిధులను విడుద ల చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ నిధులతో రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి కీలకమైన బకాయిలను ప్రభుత్వం పూర్తిగా చెల్లించింది.



## పేపర్ లీక్‌తో యువత - యువతను ఇలా నిరాశపరచకూడదు

# తీవ్రమానసిక క్షోభ

## నీట్ లీక్ వ్యవహారంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్య..

- పేపర్ లీకేజీ వ్యవహారంలో అఫిడవిట్ దాఖలు చేసిన ఎన్టీఏ
- అన్ని పరీక్షలను పారదర్శకంగా నిర్వహించేందుకు కట్టుబడి ఉన్నట్లు వెల్లడి
- పేపర్ లీక్‌తో యువత తీవ్రమానసిక క్షోభ అనుభవిస్తోందన్న సుప్రీంకోర్టు

*ఎన్నో ఆశలతో 'నీట్' పరీక్ష రాసిన యువతను ఇలా నిరాశపరచకూడదని భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. గతంలో జరిగిన లీక్‌ల నుంచి గుణపాఠం నేర్చుకోలేదంటూ గతవారం కేంద్ర సంస్థ ఎన్టీఏపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. తాజాగా, నీట్ పరీక్ష పేపర్ లీక్ కావడం వల్ల యువత తీవ్రమైన మానసిక క్షోభను అనుభవిస్తోందని వ్యాఖ్యానించింది.*

### అఫిడవిట్ దాఖలు చేసిన ఎన్టీఏ

ఈ ఏడాది మే 3వ తేదీన దేశవ్యాప్తంగా జరిగిన నీట్-యూజీ 2026 పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. తన పర్యవేక్షణలో నిర్వహించే అన్ని పరీక్షలను పారదర్శకంగా నిర్వహించేందుకు కట్టుబడి ఉన్నట్లు పేర్కొంది. పేపర్ లీకేజీ, మాల్ ప్రాక్టీస్ వంటి ఘటనలు జరగకుండా ఉండేలా చర్యలు చేపట్టేందుకు కేంద్ర విద్యా శాఖతో కలిసి పనిచే స్తున్నట్లు పేర్కొంది. పరీక్షల్లో పారదర్శకతను పెంచేందుకు కేంద్రం ఏర్పాటు చేసిన మాజీ ఇస్రో ఛైర్మన్ కె.రాధాకృష్ణన్ కమిటీ సిఫార్సులలో చాలా వరకు ఇప్పటికే అమలు చేసినట్లు తెలిపింది.ఎన్టీఏ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతంచేయడం కోసం 16 కొత్త సీనియర్ పోస్టులను ఏర్పాటు చేశామని,టెక్నాలజీ ఆపరేషన్స్,టెస్ట్ సెక్యూరిటీ పర్యవేక్షణకు ఇద్దరు జాయింట్ సెక్రటరీల స్థాయి అధికారులను అడిషనల్ డైరెక్టర్స్ జనరల్‌గా నియమించినట్లు అఫిడవిట్‌లో పేర్కొంది.

హైదరాబాద్‌లో కోట్ల రూపాయల

## భూకబ్జాకు యత్నం..?

### పరారీలో వైసీపీ మాజీ ఎమ్మెల్యే: డీసీపీ

**హైదరాబాద్,మే,29,(సత్య తెలంగాణ):** హైదరాబాద్ ప్రాంతంలో రూ.1,500 కోట్ల విలువైన భూమి కబ్జాకు యత్నించిన ఏపీకి చెందిన వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పరారీలో ఉన్నారని శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ తెలి పారు. డీసీపీ ఈరోజు మీడియా సమావేశం నిర్వహించారు. నకిలీ పత్రాలతో బ్రహ్మనాయుడు, మరికొందరు కలిసి గండిపేటలో భూమి కబ్జాకు ప్రయత్నించారని తెలిపారు. గండిపేట సర్వే నెంబర్ 18లో భూ మిని కబ్జా చేసేందుకు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారని డీసీపీ వెల్లడించారు. నకిలీ పత్రాలను సృష్టించిన ముగ్గురు వ్యక్తులు నిమ్మల రాజేశ్ గౌడ్,వేణుగోపాల్, సాయి కిరణ్‌లను అరెస్టు చేసినట్లు చెప్పారు. అయితే మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, బొల్లా రమేశ్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ సర్వే నెంబర్‌లోని భూమిని క్ర మబద్ధీకరించిందని తప్పుడు జీవోలు సృష్టించారని, ఇవి సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయని అన్నారు. దీంతో అప్రమత్తమైన తహసీల్దారు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. చట్టబద్ధమైన హక్కులు లేకుండానే భూమిని విక్రయించాలని కుట్ర చేసినట్లు విచారణలో వెల్లడైనట్లు డీసీపీ తెలిపారు.

# కర్ణాటక రాజకీయాల్లోనే ఉంటా: సిద్ధూ

- కొడుకుకు కీలక మంత్రిత్వ శాఖలు.. డిమాండ్ల జాబితాను రాహుల్ గాంధీకి ఇచ్చిన సిద్ధరామయ్య
- రాజీనామా అనంతరం ఢిల్లీకి చేరుకున్న సిద్ధరామయ్య
- కుమారుడు యతీంద్రతో కలిసి ఖర్గే, రాహుల్ గాంధీలను కలిసిన సిద్ధూ
- రాష్ట్రానికి సేవ చేసే అవకాశం ఇచ్చినందుకు అధిష్ఠానానికి థ్యాంక్స్ చెప్పిన సిద్ధరామయ్య...



**న్యూఢిల్లీ,మే,29,(సత్య తెలంగాణ):**కర్ణాటక ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన మరుసటిరోజే, సిద్ధరామయ్య శుక్రవారం ఉదయం ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే,పార్టీ అ గ్రనేత రాహుల్ గాంధీని కలిశారు. డీకే శివకుమార్ నేతృత్వంలో ఏర్పడబోయే మంత్రివర్గ ంలో తన కుమారుడికి కీలక మంత్రిత్వ శాఖలు కేటాయించాలని కోరడంతో పాటు తన డిమాండ్ల జాబితాను పార్టీ అధిష్ఠానానికి సమర్పించారు. ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన అనంతరం సిద్ధరామయ్య గురువారం రాత్రి ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. తన కుమా రుడు యతీంద్రతో కలిసి ఖర్గే, రాహుల్ గాంధీలను కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సేవ చేసే అవకాశం కల్పించినందుకు పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. తాను కర్ణాటక రాజకీయాల్లోనే ఉంటానని పార్టీ పెద్దలకు చెప్పారు. అనంతరం ఆయన తన డి మాండ్ల జాబితాను వారికి ఇచ్చారు. సిద్ధరామయ్య రాజ్యసభ, ఎమ్మెల్సీ నియామకాల కోసం కొన్ని పేర్లను అధిష్ఠానానికి సమర్పించినట్లు తెలుస్తోంది. అలాగే మంత్రివర్గంలో కేటాయించే పదవులపై కూడా తన ప్రాధాన్యతలను ఆయన జాబితాలో పొందుపరిచారు.

## ప్రతి ఓటును కాపాడుకోవాలి

### - మహేశ్ కుమార్ గౌడ్

**హైదరాబాద్,మే,29,(సత్య తెలంగాణ):** దేశంలోని పలు రాష్ట్రాల్లో ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘం ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)ను పూర్తి చేసిన సంగతి తెలిసిందే. మిగిలిపోయిన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ ప్రక్రియను ఈసీ ప్రారంభించింది. ఈనేపథ్యంలో ఈ ప్రక్రియ సమయంలో అనుసరించాల్సిన తీరుపై తెలం గాణ కాంగ్రెస్ పార్టీ తమ నేతలకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. గాంధీ భవన్ ప్రారంభమైన ఈ కార్యక్ర మంలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ తదితరులు పాల్గొన్నా రు. తెలంగాణ కాంగ్రెస్ కమిటీ మాస్టర్ ట్రైనీలకు ఏఐసీసీ శిక్షణ విభాగానికి సంబంధించిన సౌరభ్, అనూష, నిశాంత్ శిక్షణ ఇస్తున్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ తీసుకున్న మాస్టర్ ట్రైనీలు రాష్ట్రంలోని నియోజకవర్గాల్లో బీఎల్ఏలకు శిక్షణ ఇస్తారు. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సంఘటన్ సృజన్ అభియాన్ ప్రక్రియను పకడ్బందీగా చేశామని వెల్లడించారు.

హైడ్రాలో 16 మంది ట్రాన్స్‌జెండర్లకు ఉద్యోగాలు...

## 'ఈగిల్ టీమ్' పేరిట విధులు



**హైదరాబాద్,మే,29,(సత్య తెలంగాణ):** తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఓ వినూత్న నిర్ణ యం, సమాజంలో మార్పునకు నాంది పలుకుతోంది. హైడ్రాలో 16 మంది ట్రాన్స్‌జెండర్లకు ఉద్యోగాలు కల్పించి, వారి జీవితాల్లో కొత్త వె లుగులు నింపింది. ఈ చొరవ ద్వారా వారికి గౌరవప్రదమైన జీవ నో పాధిని అందించి, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో భాగస్వాములను చేసింది. ఈ బృందంలో 11 మంది ట్రాన్స్ మహిళలు, ఐదుగురు ట్రాన్స్ పురుషులు ఉన్నారు. హైదరాబాద్, చుట్టుపక్కల ప్రాంతాల్లో చెరువులు, ప్రభుత్వ భూములపై అక్రమ కట్టడాలను తొలగించడంలో వీరు చురుగ్గా పాల్గొంటున్నారు.




## కాక్రోచ్ జనతా పార్టీ ఖాతా నిలిపివేత..

- కేంద్రానికి, ఎక్స్ సంస్థకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు..!
- ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే
- తక్షణమే ఎక్స్ ఖాతాను పునరుద్ధరించాలన్న విన్నపాన్ని తిరస్కరించిన హైకోర్టు...

***న్యూఢిల్లీ,మే,29,(సత్య తెలంగాణ):*** *మన దేశంలో కాక్రోచ్ జనతా పార్టీ తాజా సంచలనాలకు కేంద్ర బిందువుగా మారిన సంగతి తెలిసిందే. పెద్ద సంఖ్యలో యువత,సెలబ్రిటీలు ఈ పార్టీకి మద్దతుగా నిలుస్తున్నారు. మరోవైపు, ఈ పార్టీ ఎక్స్ ఖాతాను ఇండియాలో నిలిపి వేసిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో ఎక్స్ ఖాతాను నిలిపివేయడంపై కాక్రోచ్ పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఎలాంటి కారణం లేకుండానే తమ పార్టీ ఖాతాను ఎక్స్ నిలిపి వేసిందంటూ ఆయన పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ పై నేడు హైకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ పురుషైంద్ర కుమార్ కౌరవ్ ధర్మాసనం పిటిషన్ ను విచారించింది...*



## దేశానికి రుతుపవనాల షాక్..

### ఈ ఏడాది సాధారణం కంటే

## తక్కువ వర్షపాతం..!

**హైదరాబాద్,మే,29,(సత్య తెలంగాణ):** ఈ ఏడాది దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు బలహీనంగా ఉండే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తన తాజా నివేదికలో వెల్లడించింది. 2026 రుతుపవనాలకు సంబంధించి విడుదల చేసిన దీర్ఘకాలిక అంచనాల ప్రకారం, జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య కాలంలో వర్షపాతం దీర్ఘకాల సగటు (ఎల్‌పీఏ)లో కేవలం 90 శాతానికి పరిమితం కావొచ్చని తెలిపింది.

ఈ అంచనాల్లో 4 శాతం అటూఇ టూగా మార్పులు ఉండొచ్చని పేర్కొంది. దీంతో ఈసారి వర్షపాతం 'సాధారణం కంటే తక్కువ' కేటగిరీలోకి వస్తుందని, ఇది వ్యవసాయ రంగం, జలవనరులు, దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం అవుతోంది.

*ముగిసిన బండి భగీరథ్ పోలీసు కస్టడీ..*

## జైలుకు తరలింపు

- మైనర్ బాలికను లైంగికంగా వేధించినట్టు భగీరథ్ పై ఆరోపణలు
- భగీరథ్ పై పోక్సో కేసు పెట్టిన పోలీసులు
- మూడు రోజుల పాటు భగీరథ్ ను ప్రశ్నించిన పోలీసులు....



**హైదరాబాద్,మే,29,(సత్య తెలంగాణ):** మైనర్ బాలికను లైంగికంగా వేధిం చినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారు బండి భగీరథ్ పోలీసు కస్టడీ ముగిసిం ది. భగీరథ్‌ను పోలీసులు మూడు రోజుల పాటు విచారిం చారు. విచారణ ముగియడంతో భగీరథ్ ను పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. అనంతరం కోర్టు ఆదేశాల మేరకు చర్లపల్లి జైలుకు తరలించారు. ఈ కేసు ప్రత్యేక విచారణా ధికారి, కూకట్ పల్లి డీసీపీ రితిరాజ్ పర్యవేక్షణలో పోలీసులు భగీరథ్ ను విచారించారు. సీన్ రీకన్స్ట్రక్షన్ చేసేందుకు మొయి నాబాద్‌ఫామ్ హౌస్‌కు కూడా ఆయనను తీసుకెళ్లారు. డిసెంబర్ 31న బాధితురాలిని భ గీరథ్‌తన స్నేహితులతో కలిసి ఫామ్ హౌస్ కి తీసుకెళ్లి అఘాయిత్యం చేసినట్టు ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. అయితే పోలీసు విచారణలో పలు ప్రశ్నలకు భగీరథ్ సమాధానాలు చెప్పకుండా మౌనంగా ఉన్నట్టు సమాచారం.

# పవన్ ఒక ప్యాకేజ్ స్టార్..

- పవన్ కల్యాణ్‌పై జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఫైర్
- పవన్‌ను ప్యాకేజ్ స్టార్‌గా అభివర్ణించిన ఎమ్మెల్యే
- ప్రొఫెసర్ నాగేశ్వర్‌ను విమర్శించే స్థాయి పవన్‌కు లేదని వ్యాఖ్య
- తెలంగాణ జోలికొస్తే 'గో బ్యాక్ ఆంధ్ర' ఉద్యమం తప్పదని హెచ్చరిక
- హైదరాబాద్‌లో ఆస్తులు పెట్టుకుని అమరావతి కట్టడంపై ప్రశ్న



**హైదరాబాద్,మే,29,(సత్య తెలంగాణ):** ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. పవన్‌ను ఒక 'ప్యాకేజ్ స్టార్' అనిఅభివర్ణిస్తూ, భవిష్యత్తులో వైఎస్ జగన్ ఎ క్కువ ప్యా కేజీ ఇస్తే ఆయనకు మద్దతు ఇవ్వడానికి కూడా వెనుకాడరని ఎద్దేవా చేశారు. జడ్చర్లఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన ఈవ్యాఖ్యలు రాజకీయంగా కలకలం రేపుతున్నాయి. ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్‌ను వి మర్శించే స్థాయి,అర్హత పవన్ కల్యాణ్‌కు లేవని అనిరుధ్ రెడ్డి అన్నారు. "దమ్ముంటే తెలంగాణకు వచ్చి ప్రొఫెసర్ నాగేశ్వర్‌ను అరెస్ట్ చేయండి. ఆయన ఇంటి ముందు నేను అడ్డుగా నిలబడతా" అంటూ పవన్‌కు బహిరంగ సవాల్ విసిరారు. తెలంగాణ బిడ్డల జోలికి ఆంధ్రప్రదేశ్ నుంచి ఎవరైనా రావాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని, అవసరమైతే మళ్లీ 'గో బ్యాక్ ఆంధ్ర' ఉద్యమం మొదలవుతుందని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. ఈ సందర్భంగా ఏపీ రాజకీయ నేతల తీరుపై ఆయన మండిపడ్డారు.

# ఢిల్లీలో అధికారం సాధ్యమేనా?

**హైదరాబాద్,(సత్య తెలంగాణ):** తెలంగాణ రాజకీయాల్లో అధికారం దక్కించుకున్న ఏ నాయకుడికైనా ఢిల్లీ పీఠం ఒక తీపి కల. గతంలో కేసీఆర్ తన రెండో విడత పాలన చివరలో బీఆర్ఎస్ ద్వారా జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పాలని ప్రయత్నించి, చివరికి సొంత ఇలాకాలోనే పట్టు కోల్పోయారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి తన మొదటి విడత పాలనలోనే.. అది కూడా పదవి చేపట్టిన కొద్ది కాలానికే తన జాతీయ ఆకాంక్షలను బయటపెట్టారు. అయితే కేసీఆర్ ప్రస్థానానికి, రేవంత్ రెడ్డి ఆలోచనలకు మధ్య మౌలికమైన తేడాలు ఉన్నాయి. రేవంత్ రెడ్డికి ఉన్న అతిపెద్ద సానుకూలత కాంగ్రెస్ అనే జాతీయ పార్టీ అండ. కేసీఆర్ శూన్యం నుంచి ఒక జాతీయ వేదికను నిర్మించాల్సి రాగా, రేవంత్ కేవలం ఉన్న పార్టీలోనే తన స్థాయిని పెంచుకుంటే సరిపోతుంది.రేవంత్ తనకు జాతీయ ఆశలు ఉన్నాయని కానీ ఇప్పుడే కాదని చెబుతున్నారు. 2034లో అని చెబుతున్నారు. కేసీఆర్ తన రెండో పదవీకాలం ముగిసే వేళ జాతీయ రాజకీయాల గురించి గట్టిగా మాట్లాడటం మొదలుపెట్టారు. అప్పటికే పదేళ్ల పాలనపై వ్యతిరేకత మొదలైంది. కానీ రేవంత్ రెడ్డి తన మొదటి టర్మ్‌లోనే తన లక్ష్యాన్ని స్పష్టం చేశారు. ఇది ఒక రకంగా సాహసమే. నేను రెండు సార్లు సీఎంగా ఉంటాను, ఆ తర్వాతే జాతీయ రాజకీయాలకు వెళ్తాను అని చెప్పడం ద్వారా ఆయన తన కేడర్‌లో స్థిరత్వాన్ని నింపాలని చూస్తున్నారు. అయితే, పాలన ఇప్పుడిప్పుడే గాడిలో పడుతున్న తరుణంలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం వల్ల ప్రజలు ముఖ్యమంత్రి దృష్టి పాలన మీద ఉందా లేక వ్యక్తిగత ఎదుగుదల మీద ఉందా అని ప్రశ్నించే అవకాశం ఉంది.బీఆర్ఎస్ అనేది కేసీఆర్ , ఆయన కుటుంబం చుట్టూ తిరిగే పార్టీ. అక్కడ నిర్ణయాధికారం ఒక్కరిదే. కానీ కాంగ్రెస్ అలా కాదు. ఇక్కడ అంతర్గత ప్రజాస్వామ్యం ఎంత ఉంటుందో, గ్రూపు రాజకీయాలు కూడా అంతే బలంగా ఉంటాయి. రేవంత్ రెడ్డికి సొంత పార్టీలోనే బలమైన ప్రత్యర్థులు, సీనియర్లు ఉన్నారు. జాతీయ స్థాయికి ఎదగాలంటే ఆయన కేవలం ప్రతిపక్షాలనే కాదు, పార్టీలోని ఇతర పవర్ సెంటర్లను కూడా అధిగమించాల్సి ఉంటుంది. కేసీఆర్‌కు పార్టీలో ఎదురులేకపోవడం ఒక ప్లస్ అయితే, రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ జాతీయ నాయకత్వంతో ఉన్న సాన్నిహిత్యం అతిపెద్ద బలం. కేసీఆర్ తన హయాంలో తిరుగులేని ఆధిక్యతను ప్రదర్శించారు. రేవంత్ రెడ్డి ఇంకా ఆ స్థాయికి చేరుకోవాల్సి ఉంది. పాలనలో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేయడం, ఇచ్చిన ఆరు గ్యారెంటీలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా మాత్రమే ఆయన రెండోసారి ముఖ్యమంత్రి కాగలరు. ఒకవేళ సంక్షేమ పథకాల్లో విఫలమైతే, 2034 లక్ష్యం అనేది కేవలం కలగానే మిగిలిపోతుంది. తెలంగాణ ప్రజలు ప్రాంతీయ సెంటిమెంట్ కు ప్రాధాన్యత ఇస్తారు. తమ సీఎం ఢిల్లీ పర్యటనలకే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారని ప్రజలు భావిస్తే, అది రాజకీయంగా పెద్ద డ్యామేజ్ కలిగిస్తుంది.తెలంగాణ సమాజం తమ నాయకుడు తమ కోసమే పని చేయాలని కోరుకుంటుంది.

కేసీఆర్ ఎప్పుడైతే అబ్ కీ బార్ కిసాన్ సర్కార్ అంటూ ఇతర రాష్ట్రాలపై ఫోకస్ పెట్టారో, అప్పుడే తెలంగాణ ఓటర్లు ఆయనకు దూరం కావడం మొదలైంది. రేవంత్ రెడ్డి ఈ పొరపాటు చేయకుండా జాగ్రత్త పడాల్సి ఉంది. రేవంత్ రెడ్డి జాతీయ నాయకుడిగా ఎదగాలంటే, ముందుగా తెలంగాణలో తన అధికారాన్ని సుస్థిరం చేసుకోవాలి. ఒకవేళ తెలంగాణ ప్రజలు తమను నిర్లక్ష్యం చేస్తున్నారని భావిస్తే, రెండోసారి ముఖ్యమంత్రి అయ్యే అవకాశమే ఉండదు. కేసీఆర్ కంటే రేవంత్ రెడ్డికి బలమైన నెట్‌వర్క్, జాతీయ పార్టీ నేపథ్యం ఉన్న మాట వాస్తవమే అయినా.. రాజకీయాల్లో ప్రజా తీర్పు అత్యంత శక్తివంతమైనది. రేవంత్ రెడ్డి తన పాలనతో ప్రజలను మెప్పిస్తూ, ఢిల్లీ వైపు అడుగులు వేస్తేనే ఆయన కేసీఆర్ కంటే మెరుగైన ఫలితాలు సాధించగలరనేది ఎక్కువ మంది అభిప్రాయం.

# అమెరికాను లైట్ తీసుకుంటున్న ఇండియా

న్యూఢిల్లీ,(సత్య తెలంగాణ): అమెరికా.. ఈ పేరు వింటేనే ఒకప్పుడు భారత దేశ పరిపాలకులు భయపడేవారు. అమెరికా నుంచి ఎవరైనా ప్రతినిధులు వస్తున్నారంటే అలర్ట్ అయిపోయేవారు. అమెరికా అధ్యక్షుడు గనుక ఇండియాలో పర్యటిస్తే.. దేవుడు భూమ్మీదకి వచ్చినట్టు భావించేవారు. సకల సౌకర్యాలు చేసేవారు. గొప్ప గొప్ప సత్కారాలు చేపట్టేవారు. అమెరికా చెప్పినట్టు వినేవారు. ఒక్క ముక్కలో చెప్పాలంటే అమెరికా చేతిలో కీలు బొమ్మలాగా వ్యవహరించేవారు.ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అమెరికా చెప్పినట్టు వినడం కాదు కదా.. అమెరికా గట్టిగా హెచ్చరికలు చేసిన సరే వినిపించుకునే పరిస్థితి లేదు. అమెరికా ఏం చేసినా సరే నిశ్శబ్దంగా ఉండే అవకాశం లేదు. ఎందుకంటే ఇప్పుడు ఇండియా మారిపోయింది. నయా ఇండియా గా అవతరించింది. భయపడే స్థాయి నుంచి నిలబడే స్థాయికి.. వణికే స్థాయి నుంచి ఎదురు చెప్పే స్థాయికి ఎదిగింది. అందువల్లే ఇండియా విషయంలో అమెరికా ఒకప్పటి మాదిరిగా ఉండడం లేదు. ఒకప్పటి స్థాయిలో బెదిరింపులకు పాల్పడటం లేదు.మిడిల్ ఈస్ట్ ప్రాంతంలో యుద్ధం జరుగుతోంది. పరిణమాలు వేగంగా మారిపోతున్నాయి. ముఖ్యంగా క్రూడ్ ఆయిల్ దిగుమతి విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనివల్ల భారత్ లాంటి అతిపెద్ద దిగుమతి దారు దేశానికి ఇబ్బందికరమైన వాతావరణం ఏర్పడుతోంది. దీనివల్ల దేశంలో ధరల స్థాయి నిరంతరం పెరుగుతోంది.. ఇది ఎక్కడదాకా వెళ్తుందో తెలియదు. పైగా చమురు కంపెనీలకు ప్రతిరోజు 750 కోట్ల వరకు నష్టం వస్తుంది. కొనుగోలు ధరలు పెరిగిపోవడం.. ఇతర ఖర్చులు అధికంగా కావడంతో కంపెనీలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాయి. అంతకుముందే కంపెనీలకు రోజుకు 1000 కోట్ల వరకు నష్టాలు వచ్చాయి. ఈనెల 15న లీటర్ పెట్రోల్, డీజిల్ మీద మూడు రూపాయలు చొప్పున పెంచడంతో.. కొంతవరకు నష్టాలు భర్తీ అయ్యాయి.క్రూడ్ ఆయిల్ విషయంలో భారత్ ముందుచూపుతో వ్యవహరించింది. రష్యా నుంచి గతంలో భారత్ ముడి చమురు కొనుగోలు చేసేది. ఇప్పుడు కూడా కొనుగోలు చేస్తోంది. ఉక్రెయిన్ తో యుద్ధం వల్ల రష్యా నుంచి ముడి చమురు భారత్ కొనుగోలు చేయడాన్ని అమెరికా ప్రశ్నించింది. ఈనెల 16 వరకే ముడి చమురు కొనుగోలు చేయాలని డెడ్లైన్ విధించింది. ఇప్పటికే ఆ గడువు ముగిసిపోయింది. ఆయనప్పటికీ రష్యా నుంచి భారత్ ముడి చమురు కొనుగోలు చేయడం ఆగదని పెట్రోలియం శాఖ కార్యదర్శి సుజాతశర్మ ఇప్పటికే ప్రకటించారు. దీంతో ఇకపై కూడా భారతదేశానికి రష్యా నుంచి క్రూడ్ ఆయిల్ వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఏప్రిల్ 17 ముందు వరకు నౌకలలో లోడ్ చేసిన రష్యా చమురును ఏ దేశమైనా కొనుగోలు చేయవచ్చు. ఆంక్షలు ఉండవు. పైగా గతంలో రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేసింది. ఇప్పుడు కూడా కొనుగోలు చేస్తుంది.. అయితే భారత్ నుంచి ఈ ప్రకటన రావడంతో.. రష్యా ముడిచమురు కొనుగోలు చేయడానికి మినహాయింపులను అమెరికా మరో 30 రోజులపాటు పెంచడం ఇక్కడ విశేషం.

## విశాఖలో మూడు కీలక ప్రాజెక్టులు

**విశాఖపట్టణం,(సత్య తెలంగాణ):**విశాఖలో మౌలిక సదుపాయాలు, పట్టణాభివృద్ధికి సంబంధించి 3 కీలక ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం తెలిపినట్లు విశాఖ ఎంపి శ్రీ భరత్ తెలిపారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ పథకం కింద జివిఎంసి ప్రతిపాదించిన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు నేషనల్ అపెక్స్ కమిటీ ఆమోదం తెలిపినట్టు వివరించారు. రూ.1,501.03 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టులను అమలు చేయబోతున్నట్లు చెప్పారు. మధురవాడ జోన్ అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థ అభివృద్ధికి రూ.658.61 కోట్లు, మధురవాడ జోన్‌లో స్మార్ట్ తాగునీటి సరఫరా వ్యవస్థ కోసం రూ.725.18 కోట్లు, బల్క్ అండ్ సెమీ బల్క్ నీటి సరఫరా వ్యవస్థ ఆధునీకరణ కోసం రూ.117.24 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. ఈ మూడు ప్రాజెక్టులు విశాఖపట్నం పట్టణ మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయడంతోపాటు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తాయని తెలిపారు.

# చేరేవారెవరురా? నిలిచేవారెవరురా?

**హైదరాబాద్,(సత్య తెలంగాణ):** తెలంగాణలో బీఆర్ఎస్ లో కొంత అయోమయం నెలకొంది. నేతలు ఆ పార్టీలో చేరేందుకు కూడా ముందుకు రావడం లేదు. బీఆర్ఎస్ నుంచి కల్వకుంట్ల కవిత బయటకు వచ్చి వేరే పార్టీ పెట్టడంతో కొంత రాజకీయంగా ఇబ్బందులున్నాయని చెప్పాలి. వచ్చే ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ గెలుస్తుందన్న నమ్మకం లేకపోవడం వల్లనే చేరికలు లేవని ప్రత్యర్థి పార్టీలకు చెందిన సోషల్ మీడియాలో వార్తలు కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ పార్టీలో చేరికలులేవు. అలాగని వెళ్లిపోయే వారు లేరు. కొనసాగుతున్న వారు కూడా పెద్దగా అందరూ యాక్టివ్ గా లేకపోవడం కూడా చర్చనీయాంశమైంది.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయి రెండున్నరేళు గడుస్తుంది. సహజంగా అధికార పార్టీపై వ్యతిరేకత ఉంటుంది కనుక బలమైన అపోజిషన్ పార్టీలో చేరే వారు ఎక్కువగా ఉంటారు. ఇంత ముందుగా ఎందుకంటే వచ్చే ఎన్నికల్లో తమకు టిక్కెట్ కన్ఫర్మ్ చేసుకోవడం కోసం ముందుగానే వచ్చి చేరతారు. ఇటీవల జీవన్ రెడ్డి చేరికను కొందరు ఉదహరించవచ్చు. కానీ కాంగ్రెస్ లో తనకు సరైన ప్రాధాన్యత లభించకపోవడం వల్లనే జీవన్ రెడ్డి బీఆర్ఎస్ లో చేరారు కాని, లేకపోతే ఆయన కూడా చేరే వారు కారన్నది అందరూ ఒప్పుకుని తీరాల్సిన నిజం. అని కాంగ్రెస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయిన వెంటనే పది మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌ను వదిలి కాంగ్రెస్ లో చేరారు. ఆ తర్వాత ఎవరూ చేరలేదని ఆ పార్టీ నేతలు కొంత సర్ది చెప్పుకుంటున్నా.. కొత్తగా వచ్చి చేరే నేతలేరన్నదే ఇప్పుడు ప్రశ్నిస్తున్నారు.

## తెలంగాణలో ప్రజా పాలన

# హామీల అమలు ఎంతవరకు..?



**గుజ్జ సత్యం.**
ఎం.కాం., బి.ఎల్.ఐఎస్‌సి., పీజీడీసీప
చీఫ్ ఎడిటర్, సత్య తెలంగాణ

ప్రజాస్వామ్యంలో ఎన్నికలు కేవలం అధికార మార్పిడి ప్రక్రియ మాత్రమే కాదు. ప్రజల ఆశలు, ఆకాంక్షలు, ఆవేదనలు, అభిలాషలకు రాజకీయ రూపం ఇచ్చే ఘట్టం. ముఖ్యంగా తెలంగాణ వంటి ఉద్యమాల గర్భంలో పుట్టిన రాష్ట్రంలో ప్రజా పాలన అంటే ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు తీసుకురావడం అనే అర్థం మరింత బలంగా ఉంటుంది. అందుకే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చిన తర్వాత ఎంతవరకు అమలవుతున్నాయన్నది ప్రజల విశ్వాసాన్ని నిర్ణయించే ప్రధాన ప్రమాణంగా మారుతుంది. తెలంగాణలో అధికార మార్పు తర్వాత "ప్రజా పాలన" అనే నినాదం విస్తృత చర్చకు దారితీసింది. గత పాలనలో కేంద్రీకృత అధికార ధోరణి ఉందనే విమర్శల నేపథ్యంలో, కొత్త ప్రభుత్వం ప్రజల వద్దకే పరిపాలన తీసుకువెళ్తామని, పారదర్శకత పెంచుతామని, ఎన్నికల హామీలను దశలవారీగా అమలు చేస్తామని ప్రకటించింది. అయితే రాజకీయ ప్రకటనల నుంచి భూమిమీద అమలు వరకు వచ్చినప్పుడు అనేక ప్రశ్నలు ఎదురవుతున్నాయి.

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలు ప్రజల్లో భారీ ఆశలు రేకెత్తించాయి. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహలక్ష్మి పథకం, రైతులకు ఆర్థిక భరోసా, యువతకు ఉపాధి అవకాశాలు, గ్యాస్ సిలిండర్ ధర తగ్గింపు, విద్యుత్ పరిమితి వరకు ఉచిత సరఫరా వంటి హామీలు సామాన్య కుటుంబాల్లో ఆశావాదాన్ని పెంచాయి. అధికారంలోకి వచ్చిన వెంటనే కొన్ని నిర్ణయాలు అమల్లోకి రావడం ప్రజల్లో సానుకూల స్పందన తెచ్చింది. ముఖ్యంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సామాజికంగా, ఆర్థికంగా విశేష ప్రభావం చూపింది. గ్రామీణ ప్రాంతాల మహిళలు ఉద్యోగాలు, విద్య, వైద్యం, చిన్న వ్యాపారాల కోసం స్వేచ్ఛగా ప్రయాణించే అవకాశాలు పెరిగాయి.

అయితే అదే సమయంలో ఈ పథకాల అమలు విధానం, ఆర్థిక భారం, అర్హతల ఎంపిక, పరిపాలనా సామర్థ్యం వంటి అంశాలపై చర్చలు మొదలయ్యాయి. ప్రజా పాలన అంటే కేవలం సంక్షేమ పథకాల వరద కాదని, దీర్ఘకాలిక అభివృద్ధి, ఆదాయ వనరుల సృష్టి, పారదర్శక వ్యవస్థల నిర్మాణం కూడా కావాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వానికి అతిపెద్ద సవాలు ఆర్థిక నిర్వహణ. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ ఆదాయ పరంగా బలమైన రాష్ట్రంగా ఎదిగినా, గత కొన్నేళ్లలో అప్పుల భారం గణనీయంగా పెరిగింది. ఇప్పుడు భారీ సంక్షేమ హామీల అమలు నేపథ్యంలో ప్రభుత్వ ఖజానాపై ఒత్తిడి పెరుగుతోంది. ఆదాయం పెంచకుండా వ్యయాలను విస్తరించడం దీర్ఘకాలంలో ఆర్థిక అసమతుల్యతకు దారితీసే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ప్రజా పాలన అనే భావనలో మరో కీలక అంశం ప్రజలతో ప్రత్యక్ష అనుసంధానం.

**సత్య తెలంగాణ - సంపాదకీయము**

ఈ విషయంలో కొత్త ప్రభుత్వం నిర్వహించిన ప్రజాదర్బార్లు, అధికారులతో సమీక్షలు, జిల్లాల పర్యటనలు కొంత మేర ప్రజల్లో ప్రభుత్వ స్పందన పెరిగిందనే భావన కలిగించాయి. గతంలో ప్రజల సమస్యలు ఫైళ్లలోనే చిక్కుకుపోయేవన్న విమర్శల నేపథ్యంలో, ఇప్పుడు ఫిర్యాదుల స్వీకరణ, వాటి పరిష్కారంపై కొంత చురుకుదనం కనిపిస్తోంది. అయితే అది స్థిరమైన పరిపాలనా సంస్కృతిగా మారాలంటే వ్యవస్థాత్మక మార్పులు అవసరం.

తెలంగాణలో రైతు సమస్యలు ఇప్పటికీ ప్రధాన సవాలుగానే ఉన్నాయి. పంటలకు గిట్టుబాటు ధరలు, సాగునీటి నిర్వహణ, విద్యుత్ సరఫరా, రుణభారం వంటి అంశాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను




ప్రభావితం చేస్తున్నాయి. రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలు గత ప్రభుత్వంలో ప్రారంభమైనప్పటికీ, ఇప్పుడు వాటి కొనసాగింపు, మార్పులు, కొత్త విధానాలపై రైతుల్లో స్పష్టత అవసరమైంది. వ్యవసాయం లాభసాటిగా మారకపోతే గ్రామీణ వలసలు పెరిగే ప్రమాదం ఉంది.

యువత విషయానికి వస్తే, ఉద్యోగాల భర్తీ తెలంగాణ రాజకీయాల్లో ఎప్పటికీ సున్నితమైన అంశమే. రాష్ట్ర ఆవిర్భావ ఉద్యమ సమయంలో "నియామకాల రాష్ట్రం" అనే ఆశయం బలంగా వినిపించింది. కానీ సంవత్సరాలుగా నిరుద్యోగ సమస్య తీవ్రమైంది. పేపర్ లీకేజీలు, పరీక్షల వాయిదాలు, నియామకాల ఆలస్యం యువతలో అసంతృప్తిని పెంచాయి. ప్రస్తుతం ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేస్తామని చెబుతున్నప్పటికీ, యువత ఫలితాల కోసం ఎదురుచూస్తోంది. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేట్ రంగ పెట్టుబడులు, పారిశ్రామిక విస్తరణ, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలపై కూడా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

హైదరాబాద్‌ను గ్లోబల్ నగరంగా అభివృద్ధి చేయడం తెలంగాణ ప్రభుత్వాల ప్రధాన లక్ష్యంగా కొనసాగుతోంది. ఐటీ, ఫార్మా, డేటా సెంటర్లు, స్టార్టప్ రంగాల్లో హైదరాబాద్ దేశంలో కీలక స్థానం సంపాదించింది. అయితే నగర అభివృద్ధి ఒక వైపు కొనసాగుతుండగా, మౌలిక సదుపాయాలపై ఒత్తిడి పెరుగుతోంది. ట్రాఫిక్ సమస్యలు, వర్షాకాల ముంపులు, కాలుష్యం, తాగునీటి సరఫరా వంటి సమస్యలు ప్రజల దైనందిన జీవితాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ప్రజా పాలన అంటే మెట్రో నగరాల మెరుపు మాత్రమే కాదు, పట్టణ జీవన నాణ్యతను మెరుగుపరచడమూ కావాలి.

ఇక సామాజిక న్యాయం అంశం కూడా తెలంగాణ రాజకీయాల్లో కీలకంగా మారుతోంది. దీజలు, రాజలు, రాలు, మైనార్టీలకు ఇచ్చిన హామీలు ఎంతవరకు అమలవుతున్నాయన్న ప్రశ్న ముందుకు వస్తోంది. ముఖ్యంగా విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యం, సంక్షేమ పథకాల అమలులో సమానత్వం ఉండాలని సామాజిక వర్గాలు కోరుతున్నాయి. కులగణన, రిజర్వేషన్ల విస్తరణ, విద్యార్థి వసతి గృహాల పరిస్థితి వంటి అంశాలు భవిష్యత్ రాజకీయ చర్చల్లో ప్రధానంగా నిలిచే అవకాశం ఉంది.

ప్రజా పాలనలో పారదర్శకత కూడా అత్యంత ముఖ్యమైన అంశం. ప్రభుత్వ నిర్ణయాలు ప్రజలకు స్పష్టంగా తెలియాలి. టెండర్లు, ప్రాజెక్టులు, నిధుల వినియోగం, సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత ఉంటేనే ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది. సోషల్ మీడియా యుగ ంలో ప్రభుత్వాలపై ప్రజా పరిశీలన మరింత పెరిగింది. ప్రచారం కంటే పనితీరు ఇప్పుడు ఎక్కువగా కొలవబడుతోంది.

ఇక్కడ ఒక కీలక విషయాన్ని గుర్తించాలి. ఎన్నికల హామీలు అమలు చేయడం అవసరమే అయినప్పటికీ, ప్రజా పాలన అనేది కేవలం ఉచితాల రాజకీయంగా మార కూడదు. సంక్షేమం మరియు అభివృద్ధి మధ్య సమతుల్యత ఉండాలి. పేదల భద్రతతో పాటు రాష్ట్ర ఆర్థిక భవిష్యత్తును కూడా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. లేకపోతే తాత్కాలిక రాజకీయ లాభాలు వచ్చినా, దీర్ఘకాలంలో రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో పడే ప్రమాదం ఉంటుంది.

తెలంగాణ ప్రజల రాజకీయ అవగాహన గత దశాబ్దంలో గణనీయంగా పెరిగింది. ఇప్పుడు వారు కేవలం భావోద్వేగ నినాదాలను మాత్రమే కాకుండా, పాలన ఫలితాలను కూడా పరిశీలిస్తున్నారు. ఉద్యోగం వచ్చిందా? రైతుకు ఆదాయం పెరిగిందా? మహిళ భద్రత మెరుగుపడిందా? విద్యార్థికి నాణ్యమైన విద్య అందుతోందా? వైద్యం అందుబాటులో ఉందా? – ఇవే ప్రజా పాలనకు అసలైన కొలమానాలు.

ప్రస్తుతం తెలంగాణ రాజకీయ పరిస్థితుల్లో అధికార పక్షానికి సమయం కూడా ఉంది, సవాళ్లు కూడా ఉన్నాయి. ప్రజలు ఇంకా ఆశతో చూస్తున్నారు. కానీ ఆ ఆశ నెరవేరాలంటే పరిపాలన వేగం పెరగాలి. నిర్ణయాలు కేవలం ప్రకటనల దశలో కాకుండా, గ్రామస్థాయి అమల్లో కనిపించాలి. ప్రజలతో నిరంతర సంభాషణ కొనసాగాలి. విమర్శలను శత్రుత్వంగా కాకుండా ప్రజాస్వామ్య సూచనలుగా స్వీకరించే పరిపక్వత అవసరం. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి మూల కారణం "స్వీయ పాలన". ఆ స్వీయ పాలన నిజమైన ప్రజా పాలనగా మారాలంటే అధికార కేంద్రీకరణ తగ్గాలి. స్థానిక సంస్థలకు బలం పెరగాలి. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, జిల్లా వ్యవస్థలు ఆర్థికంగా, పరిపాలనాపరంగా బలోపేతం కావాలి. ప్రజల సమస్యలు హైదరాబాద్ చుట్టూ తిరగకుండా స్థానికంగానే పరిష్కారం పొందాలి.

మొత్తానికి తెలంగాణలో ప్రజా పాలనపై తీర్పు ఇంకా పూర్తిగా వెలువడలేదు. కొన్ని హామీలు అమల్లోకి వచ్చాయి. కొన్ని ఇంకా నిరీక్షణలో ఉన్నాయి. కొన్ని అమలుకు ఆర్థిక, పరిపాలనా సవాళ్లు ఎదురవుతున్నాయి. ప్రజలు మాత్రం ఒక స్పష్టమైన సందేశం ఇస్తున్నారు – మాటలు కాదు, మార్పు కావాలి. ప్రచారం కాదు, ఫలితాలు కావాలి. ప్రజాస్వామ్యంలో చివరికి గెలిచేది నినాదాలు కాదు, ప్రజల జీవితాల్లో కనిపించే మార్పే. తెలంగాణలో ప్రజా పాలన కూడా అదే ప్రమాణంతో పరీక్షించబడుతోంది...

# ట్రంప్ అధికారాలకు కత్తెర..!



**ఢిల్లీ,(సత్య తెలంగాణ):** ప్రపంచం అతలాకుతలం అవుతున్నా..తనకేమీ పట్టనట్టు ట్రంప్ మహాశయుడు ఫిడేల్ వాయిస్తున్నాడు. యుద్ధం ..యుద్ధం అంటూ కలవరిస్తున్నారు. ఇరాన్‌పై దాడులు తప్పవని హెచ్చరిస్తున్నాడు. అయితే పశ్చిమాసియా యుద్ధానికి సంబంధించి తాజాగా తీవ్ర ఉత్కంఠ పరిణామాలు చకచకా చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం తెరవెనక సాగుతున్న చర్చల్లో ఒప్పందం కుదరకుంటే... 2-3 రోజుల్లోనే.. లేదంటే వచ్చే వారం ఆరంభంలో తాము ఇరాన్‌పై దాడులతో విరుచుకుపడతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. దీంతో మరోమారు ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఇప్పటికే అమెరికా సహా అన్ని దేశాలు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నా ట్రంప్ మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇరాన్‌పై ఆయన దూకుడు ప్రవర్తనకు అమెరికా సెనెట్ కళ్లెం వేసింది. అధ్యక్షుడి యుద్ధ అధికారాలను పరిమితం చేసే తీర్మానానికి తాజాగా ఆమోదం లభించింది. దీంతో అయినా ట్రంప్ దూకుడు ఆగుతుందా అన్నది చూడాలి. ఇకపోతే ఇరాన్‌తో భారీస్థాయిలో చర్చలు జరుగుతున్నాయని, అవి సఫలమై.. మా దాడి ప్రణాళిక శాశ్వతంగా అటకెక్కుతుందని ఆశిస్తున్నా అంటూ ట్రంప్ తాజాగా వెల్లడించాక ఈ తీర్మనం వచ్చింది. టెహ్రాన్ చేతికి అణ్వాయుధాలు దక్కకుండా ఉండే ఒప్పందం మాకు ఆమోదయోగ్యమవుతుందని శ్వేతసౌధంలో విలేకర్లతో మాట్లాడుతూ ట్రంప్ పేర్కొన్నారు. ఒకవేళ ఒప్పందం కుదరకపోతే ఇరాన్‌పై భారీ స్థాయిలో వెంటనే దాడులు చేసేందుకు సన్నద్ధంగా ఉండాలని తమ అధికారులను ఆదేశించినట్లు ఆయన తెలిపారు. మంగళవారమే భారీ స్థాయిలో దాడులు జరపాలనుకున్నట్లు ట్రంప్ వెల్లడించారు. అయితే అరబ్ దేశాల నేతల విజ్ఞప్తి మేరకు చివరి నిమిషాల్లో ఆ ప్రణాళికను తాత్కాలికంగా పక్కనపెట్టానన్నారు. టెహ్రాన్‌తో చర్చలు సీరియస్‌గా సాగుతున్నాయని, అందరికీ ఆమోదయోగ్యమైన ఒప్పందం కుదిరే అవకాశాలు ఉండటం వల్లే దాడుల నిర్ణయాన్ని ప్రస్తుతానికి ఉపసంహరించుకున్నామని తెలిపారు. ఈ క్రమంలో ట్రంప్ వ్యవహార శైలి చూస్తుంటే ఆయన దేనికైనా తెగిస్తాడని అనుకోవాలి.

Editor, Printar, Publishar and Owned by Gujja Sathyam, 105/A Pavani Kamal Building Opp.SBI ,Gunfoundry, Hyderabad, Telangana - 01. Cell. 9248018435